క్లుప్తంగా

నీటి తొట్టె నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న దృశ్యం

అమరాపురం: మండలంలోని బవవనపల్లిలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఏపీఓ జగదీష్ ఆధ్వర్యంలో మంగళవారం నీటి తొట్టె నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పశువులకు ఎండకాలంలో తాగడానికి నీరు దొరకడం కష్టంగా మారిందన్నారు. అందుకే నీటి తొట్టెల నిర్మాణాన్ని చేపట్టామన్నారు. పశువులకు నీరు అందించడానికి ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని యారంగాపురం గ్రామం వద్ద ఉపాధి హామీ పథకం కింద పశువుల నీటి తొట్టె నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేశారు.

క్రికెట్ టోర్నీ విజేత 'ఫ్రెండ్స్ లెవన్'



ఫ్రెండ్స్ లెవన్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ఉగాది ఉత్సవాల సందర్భంగా జమ్మానపల్లి గ్రామస్తులు మండలంలోని గౌడనహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఫ్రెండ్స్ లెవెన్ జట్టు, స్టార్ లైట్ స్ట్రైకర్ జట్టు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన స్టార్ లైట్ స్ట్రైకర్స్ జట్టు 89 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్‌కు దిగిన లెవెన్ ఫ్రెండ్స్ లక్ష్యాన్ని పూర్తి చేసింది. విజేతగా నిలిచిన ఫ్రెండ్స్ లెవల్ జట్టుకు ట్రోఫీ అందజేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



నాయకులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

అమరాపురం: గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ మడకశిర నియోజకవర్గం సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. మండలంలోని హేమావతి గ్రామ పంచాయతీకి చెందిన నాయకులు నరసింహ, మురళి, లవకుశ, కొర్రేవు నరేష్‌రెడ్డి, నంజుండప్ప, రవీంద్ర తదితరులు మంగళవారం ఫళారం గ్రామంలో సమన్వయకర్తను కలిశారు. ఈ సందర్భంగా పార్టీ పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మడకశిర నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా అందరం కలిసి పనిచేద్దామన్నారు. మనం ఎవరికీ భయపడాల్సిన పనిలేదన్నారు. కూటమి నాయకుల కుట్రలు, కుయుక్తులు, ప్రలోభలకు లొంగకుండా పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజలు విసిగిపోయారన్నారు.

జైభీమ్ ర్యాలీని విజయవంతం చేయండి




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బహుజన చైతన్య వేదిక నాయకులు

పరిగి: ఈనెల 14న పెనుకొండలో బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే జైభీమ్ ర్యాలీని విజయవంతం చేయాలని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ పిలుపునిచ్చారు. పరిగి మండల కేంద్రం బీరప్ప ఆలయ ప్రాంగణంలో జైభీమ్ ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. శివరామకృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 135వ జయంతి సందర్భంగా పెనుకొండలోని వై జంక్షన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ రామాంజినప్ప, సర్పంచ్ శివశంకర్, మాజీ ఎంపీపీ గోవిందప్ప, నాయకులు మద్దిలేటి, రామదాసు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మేమేం పాపం చేశాం ?!

- గొబ్బరంపల్లిలో టీడీపీ నాయకుల అరాచకం
- వైఎస్సార్‌సీపీ మద్దతుదారులంటూ సీసీ రోడ్డు వేయించని వైనం
- వంద మీటర్లలో 70 మీటర్లలో మాత్రమే నిర్మాణం
- రోడ్డు మొత్తం నిర్మించినట్లు బిల్లు, బోర్డు ఏర్పాటు !
- సీసీ రోడ్డు వేయకపోవడంతో స్థానికుల ఆవేదన



మాల అంజినప్ప ఇంటి వరకూ రోడ్డు నిర్మించినట్లు ఏర్పాటు చేసిన బోర్డు



గొబ్బరంపల్లిలోని వీధి చివర్లో రోడ్డు నిర్మించకపోవడంతో మట్టి రోడ్డే కనిపిస్తున్న దృశ్యం



గోవిందప్ప ఇంటి వద్ద నుంచి వేసిన సీసీ రోడ్డు

రొద్దం: మండల పరిధిలోని చోళేమర్రి పంచాయతీ గొబ్బరంపల్లిలో ఇటీవల జాతీయ గ్రామీణ ఉపాధి నిధులతో సిమెంట్ రోడ్డు వేశారు. గోవిందప్ప ఇంటి వద్ద నుంచి మాల అంజినప్ప ఇంటి వరకూ రోడ్డు నిర్మించినట్లు బోర్డు కూడా ఏర్పాటు చేశారు. అయితే వాస్తవంగా రోడ్డు నిర్మించింది మాత్రం డీకే రాజు అనే వ్యక్తి ఇంటి వరకూ మాత్రమే. ఆ తర్వాత మరో 30 మీటర్లు రోడ్డు వేయాల్సి ఉన్నా రోడ్డు వేయలేదు. 'మేమేం పాపం చేశాము... మా ఇండ్ల ముందు రోడ్డు ఎందుకు వేయలేదు' అని అక్కడున్న స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.6 లక్షలు జేబులోకి...

గొబ్బరంపల్లిలో తాజాగా నిర్మించిన సిమెంట్ రోడ్డు ఏర్పాటు దాదాపు వంద అడుగులు వేయాల్సి ఉంది. అయితే కేవలం 70 అడుగుల రోడ్డు వేసి వంద అడుగులు వేసినట్లు రూ.6 లక్షల నిధులు డ్రా చేసుకున్నారు. ఆ వీధి చివరిలో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఉన్నారంటూ టీడీపీ నాయకులు రోడ్డు వేయకుండా అడ్డుకున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. రోడ్డు వేయకుండానే బిల్లు ఎలా చేసుకున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ సొమ్ముపై వారి పెత్తనం ఏంటో చెప్పాలంటున్నారు. తమ ఇళ్ల వద్దకు రోడ్డు ఎందుకు ఏర్పాటు చేయలేదో సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలని, ఆ నిధులు ఏమయ్యాయో కూడా ఉన్నతాధికారులు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రశ్నిస్తే అక్రమ కేసులు



మేము వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కావడంతో మా ఇళ్ల వద్ద సిమెంట్ రోడ్డు వేయకుండా సగానికే ఆపేశారు. రోడ్డు ఎంతవరకూ వేశారో అంత వరకూ మాత్రమే బోర్డు ఏర్పాటు చేయాలి కదా? ఎందుకు బోర్డులో మాల అంజినప్ప ఇంటి వరకూ రోడ్డు వేసినట్లు బోర్డులు ఏర్పాటు చేశారో సంబంధిత అధికారులు చెప్పాలి. కూటమి నాయకులు చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారు. పోలీసులతో నానా బూతులు తిట్టిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో రోడ్డు వేయడాన్ని కూడా రాజకీయం చేయటం మంచి పద్ధతి కాదు.

– శివకుమార్ గొబ్బరంపల్లి

నిధులు సరిపోలేదు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గొబ్బరంపల్లిలో సీసీ రోడ్డు వేయడం జరిగింది. అయితే నిధులు సరిపోకపోవడంతో రోడ్డు పూర్తిగా వేయలేదు. మళ్లీ నిధులు మంజూరు చేసి మిగిలిన ఇళ్ల వరకూ రోడ్డు నిర్మిస్తాము. ఇందులో ఎలాంటి రాజకీయం లేదు.

– వెంకటరమణ, పీఆర్ జేఈ

జాతీయ స్థాయిలో 'పురం' విద్యార్థిని ప్రతిభ

- ఎన్‌ఏఏటీ పరీక్షలో మొదటిస్థానం



అలీషా అంజుంను అభినందిస్తున్న పాంచజన్య బ్రిలియంట్ స్కూల్ యాజమాన్యం

హిందూపురం టౌన్: నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలియన్స్ ఇండియా (ఎన్ఐఎస్ఏ) ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎన్ఏఏటీ (నేషనల్ అనలైటికల్ అప్టిట్యూడ్ టెస్టు) పరీక్షల్లో పట్టణానికి చెందిన చిన్నారి అలీషా అంజుం ప్రతిభ చాటింది. ప్రథమ స్థానంలో నిలిచి అందరి మన్ననలనూ పొందుతోంది. పట్టణంలోని పాంచజన్య బ్రిలియంట్ పాఠశాలలో అలీషా అంజుం 3వ తరగతి చదువుతోంది. ఈ సందర్భంగా మంగళవారం ఆ స్కూల్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ జాతీయస్థాయిలో లక్షలాది మంది ఆన్‌లైన్ ద్వారా పరీక్షల్లో పాల్గొనగా తమ విద్యార్థి అలీషా అంజుం మొదటిస్థానంలో నిలవడం గొప్పవిషయమన్నారు. విమర్శణాత్మక ఆలోచన, సృజనాత్మక ఆలోచన, తార్కికం, సమస్య పరిష్కారం, బహుళ మేధస్సు అంశాలపై పరీక్ష నిర్వహించారన్నారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు మరో 20 మంది విద్యార్థులు వివిధ ర్యాంకులను సాధించారని వివరించారు. సమావేశంలో పాఠశాల హెచ్ఎం గాయత్రి, ఏఓ భాస్కర్, సూపరింటెండెంట్ విజయేంద్ర, ఏహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్‌తో పాటు అలీషా అంజుం తల్లిదండ్రులు అఫ్రోజ్ భాను, ఇనాయత్‌బాషా పాల్గొన్నారు.


చలో కదిరికి తరలిరండి

మడకశిరరూరల్: కదిరి మున్సిపల్ కార్యాలయం ఎదుట 3వ తేదీ ముస్లిం ఐక్యవేదిక కమిటీ ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడు వసీమ్ బేగ్ పిలుపునిచ్చారు. మడకశిర నియోజవర్గం నుంచి ముస్లింలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఏజీపీగా గోవిందప్ప

మడకశిర: మడకశిర జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా న్యాయవాది గోవిందప్ప నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అగళి మండలానికి చెందిన గోవిందప్ప మడకశిర కోర్టులో కొన్నేళ్ల నుంచి న్యాయవాదిగా పని చేస్తున్నారు. ఏజీపీగా గోవిందప్ప నియామకం కావడంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



సోమందేపల్లిలో ...



అలంకరణలో ముదిరెడ్డిపల్లి చౌడేశ్వరీదేవి

హిందూపురం: మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. చౌడేశ్వరీదేవి మూలవిరాట్‌ను అలంకరించి పూజలు చేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచే దీక్షాపరులు పంచమి జ్యోతులను తలపై ఎత్తుకుని ఆలయం వద్ద నుంచి ముదిరెడ్డిపల్లి పురవీధుల గుండా నృత్యాలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. జ్యోతులు మోయడానికి దీక్ష తీసుకున్న భక్తులు డప్పులు, మేళాల వాయిద్యాలకు అనుగుణంగా జ్యోతులను తలపై ఎత్తుకుని నృత్యం చేశారు. చౌడేశ్వరీదేవి జ్యోతుల పండగ సందర్భంగా ముదిరెడ్డిపల్లి ప్రాంతమంతా కిటకిటలాడింది. అలాగే ముదిరెడ్డిపల్లి పురవీధుల గుండా పూజమ్మ, చౌడమ్మ ఉత్సవమూర్తులను ఊరేగించారు. పట్టణ ప్రముఖులు, నాయకులు తరలివచ్చి జ్యోతుల ఉత్సవం, చౌడేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకున్నారు.

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో మంగళవారం చౌడేశ్వరీదేవి పంచమ జ్యోతుల మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ డీ.సీ. ఈశ్వరయ్య, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు హరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. జ్యోతులను తలపై పెట్టుకొని గ్రామంలో ఊరేగించారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తుల తరలి వచ్చారు. మంత్రి సవిత ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



ముద్దిరెడ్డిపల్లిలో జ్యోతుల ఊరేగింపు



జ్యోతులతో దీక్షాపరుల విన్యాసాలు

ముగిసిన పదో తరగతి పరీక్షలు



అమరాపురం:పరీక్షలు ముగియడంతో సంతోషంగా బయటకు వస్తున్న విద్యార్థులు

అమరాపురం: పదోతరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారం సోషియల్ పరీక్షతో ముగిశాయి. గత 17వ తేదీ పరీక్షలు ప్రారంభం కాగా ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా పరీక్షలు ముగియడంతో అటు అధికారులు ఇటు పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పరీక్షలు ముగియడంతో ఎంతో సంతోషంగా పది విద్యార్థులు ఇళ్లకు వెళ్లారు. కేజీబీవీ, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల, ఏపీ మోడల్ పాఠశాల వసతి గృహంలో ఉన్న పదోతరగతి విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి ఇంటికి వెళ్లిపోయారు.

గుడిబండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు పరీక్షకు 405 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈఓ-2 రవిచంద్రన్ తెలిపారు.

శ్రీరామనవమి వేడుకలకు ఎస్పీకి ఆహ్వానం



ఎస్పీరత్నను ఆహ్వానిస్తున్న ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు

పుట్టపర్తి టౌన్: గోరంట్ల మండలం కరావులపల్లి సమీపంలో వెలసిన శివుడు, ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించే శ్రీరామనవమి వేడుకలకు హాజరుకావాలని ఎస్పీ రత్నను దేవాలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు వారు మంగళవారం పుట్టపర్తిలో ఎస్పీ బంగ్లా వద్ద ఎస్పీని కలిశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 6న ఆంజనేయస్వామి దేవాలయం వద్ద సీతారాములు కల్యాణోత్సవం అనంతరం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఎస్పీని కలసిని వారిలో ఆలయ నిర్వాహకులు సునీతా శంకర్‌లాల్ నాయక్, గోరంట్ల జెడ్పీటీసీ మెంబర్ పాలే జయరామ్‌నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ ఏడీ శ్రీరామ్‌నాయక్, తదితరులున్నారు.

మినుకు పీహెచ్‌డీ పట్టా



పావగడ: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం అసిస్టెంట్ అధ్యాపకురాలు ఎం మిను పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. బెంగుళూరులోని సెయింట్ జోసెఫ్ వాణిజ్య కళాశాలలోని వాణిజ్య శాస్త్ర విభాగం అసిస్టెంట్ అధ్యాపకుడు డి రాజా జేబాసింగ్ ఆధ్వర్యంలో 'ఏ స్టడీ ఆఫ్ ప్రైస్ డిస్కవరీ అండ్ రిస్క్ మేనేజ్‌మెంట్ ఇన్ ఇండియన్ అగ్రికల్చరల్ కమాడిటీ మార్కెట్-విత్ స్పెషల్ రెఫరెన్స్ టు సెలెక్టెడ్ సాఫ్ట్ కమాడిటీస్' అనే అంశంపై పరిశోధన చేశారు. మినుకు పీహెచ్‌డీ రావడంపై స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ డా ఎన్పీ శివానందయ్య, అధ్యాపకులు హర్షం ప్రకటించారు.

పింఛన్ పంపిణీ చేసిన మంత్రి



పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో మంత్రి సవిత పాల్గొన్నారు. మంగళవారం ఉదయం పార్టీ కార్యాలయం వద్ద జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పంపిణీ చేస్తున్న పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వక్క చెట్లకు నిప్పు

రొళ్ల: ఆకతాయిలు నిప్పు రాజేయడంతో 75 వక్కచెట్లు దగ్ధమయ్యాయి. బాధిత రైతు గోవిందప్ప తెలిపిన వివరాల మేరకు.. రొళ్ల మండలం టీడీ పల్లి గ్రామానికి చెందిన గోవిందప్ప రెండు ఎకరాల్లో మూడేళ్ల క్రితం 750 వక్క మొక్కలు సాగు చేశారు. సోమవారం సాయంత్రం వరకూ వక్కతోట వద్దనే ఉండి ఇంటికి చేరుకొన్నాడు. మంగళవారం ఉదయం తోట వద్దకు వెళ్లి చూడగా అప్పటికే తోటకు ఆనుకొని ఉన్న ఎండు గడ్డికి ఆకతాయిలు నిప్పు రాజేయడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి తోటను చుట్టు ముట్టాయి. విషయం గమనించిన గోవిందప్ప కుటుంబ సభ్యులతో తోట వద్దకు చేరుకొని మంటలు ఆర్పడానికి ప్రయత్నించారు. అయితే అప్పటికే దాదాపు 75 వక్క చెట్లు, అమర్చిన పరికరా, పీవీసీ పైపులు కాలిపోయాయి. సుమారు రూ.30 వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. అధికారులు పంటనష్టాన్ని పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని రైతు కోరారు.

ఘనంగా మల్లాలమ్మ జాతర

గోరంట్ల: మండల కేంద్రమైన గోరంట్ల లోని చిత్రావతి నది ఒడ్డున వెలసిన సత్య దేవత మల్లాలమ్మకు మేదర కులస్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో జ్యోతులు సమర్పించారు. పట్టణంలోని బస్టాండ్ సర్కిల్ నుంచి చిత్రావతి నది ఒడ్డున వెలసిన ఆలయం వరకూ జ్యోతులతో ఊరేగింపు సాగింది. అనంతరం అమ్మవారికి జ్యోతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



హిందూపురం	37
పెనుకొండ	38
మడకశిర	37

3 నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

హిందూపురం టౌన్: పదో తరగతి పరీక్షలకు హాజరై పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పాలీసెట్-2025లో అర్హత సాధించేందుకు వీలుగా ఈ నెల 3 నుంచి 28వ తేదీ వరకూ స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు తెలిపారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ కూడా అందిస్తామన్నారు. పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15వ తేదీ ఆఖరు అన్నారు.

నేటి నుంచి దూరవిద్య పరీక్షలు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నుంచి ఎస్కేయూ దూరవిద్య డిగ్రీ పీజీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కేశవరావు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు స్టడీ సెంటర్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. పరీక్ష హాల్లోకి సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు నిషేధిత బుక్కులు పేపర్లు అనుమతించబోమన్నారు.

ముత్యాల పల్లకీలో చౌడేశ్వరీదేవి



చౌడేశ్వరీదేవిని ఊరేగిస్తున్న దృశ్యం

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవి అమ్మవారిని సోమవారం రాత్రి ముత్యాల పల్లకీలో ఊరేగించారు. గ్రామ వీధుల్లో మంగళ వాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు సాగింది. లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ హాజరై భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

జూదరుల అరెస్ట్

అగళి: మండల పరిధిలోని రామపురం గ్రామంలో వక్కోటలో పేకాట ఆడుతున్న ఐదుగురిని మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,400 నగదును స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని గోవిందాపురం క్రాస్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓడీసీ మండలానికి చెందిన చిక్క మంగళూరులో ఫిజియోథెరపీ చదువుతున్న విద్యార్థి మణివర్ధన్‌రెడ్డికి తీవ్రగాయాలైయ్యాయి. చిక్క మంగళూరు నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. క్షతగాత్రుడిని వెంటనే మహేష్, యూటీఎఫ్ నాయకులు భూతన్న, మాలింగప్ప 108 వాహనంలో మడకశిర ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్సలు నిర్వహించి డాక్టర్ అనిల్ భార్గవ్ సూచన మేరకు మెరుగైనా చికిత్సల కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

పూర్తిస్థాయిలో బియ్యం సరఫరా చేయండి



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర: నియోజకవర్గంలోని డీలర్లకు ప్రతినెలా పూర్తిస్థాయిలో బియ్యం సరఫరా చేయాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఆర్అండ్‌బీ బంగ్లాలో ఆయన డీఎస్ఓ వంశీకృష్ణ, తహసీల్దార్లు, సీఎస్‌డీటీలతో సమావేశమై డీలర్ల సమస్యలపై చర్చించారు. డీలర్లకు ప్రతి నెలా తక్కువగా బియ్యం సరఫరా చేయడానికి కారణాలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు.

మృతులకు ఎమ్మెల్యే నివాళి

పట్టణంలో ఇటీవలనే ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన క్రిష్టాచారి, సరళ, సంతోష్, భువనేష్ చిత్రపటాల వద్ద ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు.